
నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 25 డిసెంబర్ 2024 | KAMAREDDY






# నేడు క్రిస్మస్

- ఉమ్మడి జిల్లాలో విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

క్రిస్మస్.. ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ. బుధవారం క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చిలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఉదయం 5 గంటల నుంచి చర్చిల్లో ఆరాధనలు కొనసాగనున్నాయి.

–కంఠేశ్వర్, డిసెంబర్ 24

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విద్యుద్దీపాలతో ముస్తాబైన సీఎస్ఐ చర్చి




# పెద్ద దిక్కెవరు..

**రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ** అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నది. మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికీ అమాత్యయోగం కలుగలేదు. తర్వాత మంత్రి వర్గ విస్తరణ రేపు మాపు ఉంటుందంటూ ఏడాదికాలంగా వినిపిస్తున్నా..ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా లేదు. దీంతో ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కులేకుండా పోయింది. నలుగురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలున్నప్పటికీ ఎవరికీ మంత్రివర్గంలో స్థానం లభించలేదు. అసలు మంత్రి వర్గ విస్తరణ ఉంటుందా అనేది జవాబు లేని ప్రశ్నగా మిగిలింది. మంత్రి పదవిపై ఎమ్మెల్యేలు ఎన్నో ఆశలు పెట్టుకోగా.. ప్రాగదీత పరిస్థితిలో రోజుకొకరు తెర మీదకు వస్తున్నారు. రేసులో నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సుదర్శన్ రెడ్డికే మంత్రి యోగం తథ్యమన్న సంకేతాలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నాయి. పెద్దాయనకే అమాత్య యోగం దక్కుతుందని అంతా అనుకుంటున్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమేనంటూ సుదర్శన్ రెడ్డి కూడా అనేక సందర్భాల్లో చెప్పుకుంటున్నప్పటికీ ఎప్పుడన్నది తెలియడంలేదు. త్వరలో మంత్రివర్గ విస్తరణ అంటూ వార్తలు వస్తుండడం..టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకోవడం గమనార్హం.

–నిజామాబాద్, డిసెంబర్ 24
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**మంత్రి పదవిని** ఆశిస్తున్న వారంతా కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో సీనియర్ లీడర్లు తీవ్రంగా ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడాదిగా ఇదే విషయమై ఢిల్లీ దాకా పైరవీలు చేస్తున్నారు. రోజుకొకరు తెర మీదికి వచ్చి మంత్రి పదవిని ఆశిస్తున్న నేపథ్యంలో పోటీ రోజురోజుకూ పెరుగుతున్నది. ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆశించడం తప్పేం కాదన్నట్లుగా ఏఐసీసీ దాకా మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలు కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. దీంతో మొదటి జాబితాలోనే పేరున్న వారిలో ఈ కొత్త పరిణామాలు ఒకింత ఇబ్బందికి గురి చేస్తున్నాయి. చూస్తుండగానే ఏడాది కాలం కరిగి పోయింది. ఏ పదవీ లేకుండానే ఎమ్మెల్యేగానే కొనసాగుతుండడంతో జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేకు సైతం మింగుడు పడటం లేదు. శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలోనే ఇదే తనకు చివరి ఎన్నికలుగా సుదర్శన్ రెడ్డి ప్రకటించుకున్నారు. ప్రభుత్వం వస్తే పదవి గ్యారంటీ అని మొదట్నుంచి ఆశిస్తూ వస్తున్నారు. కానీ అందుకు విరుద్ధమైన పరిస్థితి ఇప్పుడు ఎదురవుతోంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వాస్తవానికి సుదర్శన్ రెడ్డికి ఎవ్వరూ పోటీ లేరు. గెలిచిన నలుగురు ఎమ్మెల్యేల్లో సీనియారిటీ, కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఆయనకే అర్హతలు ఉన్నాయి. అయినప్పటికీ మంత్రి పదవి విషయంలో మాజీ మంత్రికి పేచీలు వెంటాడుతున్నాయి. ఎందుకు? ఎవరు? అడ్డు తగులుతున్నారో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో ఆయన కొట్టుమిట్టాడుతున్నారు. కొద్ది కాలం క్రితం వరకు మంత్రి పదవి వచ్చేస్తుందనుకుని దూకుడు ప్రదర్శించారు. ఉమ్మడి జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో సమీక్షలు, సమావేశాలు నిర్వహించి హల్‌చల్ చేశారు. తీరా మంత్రి వర్గ విస్తరణలో జాప్యంతో కినుక వహించి అంటి ముట్టనట్లుగానే ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. సుదర్శన్ రెడ్డి అనుచరవర్గం సైతం ఈ విషయంలో ఒకింత అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది.

### పాద యాత్రలు, విన్నపాలు..

నిజామాబాద్ జిల్లాలో బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. వీరిలో భూపతి రెడ్డి తొలిసారి చట్ట సభకు ఎన్నికయ్యారు. గతంలో ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఉన్నప్పటికీ ఇప్పుడు నేరుగా శాసనసభలో అడుగు పెట్టారు. ఇక బోధన్ నుంచి సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఇద్దరు నేతలు మంత్రి పదవి కోసం విన్నపాలు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. కామారెడ్డి జిల్లా నుంచి ఎల్లారెడ్డి, జుక్కల్ శాసనసభ్యులు ఇరువురు తొలి సారి అసెంబ్లీకి ఎన్నుకోబడ్డారు. ఏఐసీసీ అండదండలతో మదన్ మోహన్‌రావు తీవ్రంగా పైరవీ చేసుకుంటున్నాడు. తాజాగా తన అనుచరులు సదాశివనగర్‌లో మంత్రి పదవి ఇవ్వాలంటూ పాద యాత్ర చేసి నిరసన తెలిపారు. మదన్ మోహన్ రావు చర్యలతో కాంగ్రెస్ పార్టీలో దుమారం రేగుతోంది. తనకే మంత్రి పదవి ఖాయమని భావిస్తున్న సుదర్శన్ రెడ్డికి బహిరంగంగానే మదన్ మోహన్ రావు రూపంలో పోటీ ఏర్పడింది. ఇద్దరూ అమాత్య యోగం కోసం ఏడాదిగా ఎవరికి వారు పైరవీ చేసుకుంటున్నారు. వీరికి తోడుగా జుక్కల్ ఎమ్మెల్యే సైతం తనకున్న ప్రాబల్యాన్ని ఇందుకోసం వాడుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతున్నది. ఏకంగా దళిత సామాజిక వర్గం కోటాలో మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు శ్రేణులు చెప్పుకుంటున్నాయి. ఇలా ఎవరికి వారు మంత్రి పదవి కోసం తలబడుతుండడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. 2024 సంక్రాంతి నుంచి మొదలైన ఈ పోటీ 2025 సంక్రాంతి వస్తున్నా ముగింపు కార్డు మాత్రం పడలేదు. 2023, డిసెంబర్ 7న పది మంది మంత్రులతో కలిసి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. తదనంతరం రేపు మాపు అంటూ వాయిదాలు మినహా ఆశావహులకు భరోసా దక్కడం లేదు. పీసీసీ చీఫ్‌గా పార్టీ పదవిని దక్కించుకున్న మహేశ్‌కుమార్ గౌడ్ సైతం బీసీ కోటాలో మంత్రి పదవి అడిగినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. షబ్బీర్ అలీ సైతం తన చివరి రాజకీయ మజిలీలో మంత్రి యోగం కోసం మైనార్టీ కోటాలో పట్టుబడుతున్నాడు. మొత్తానికి ఉమ్మడి జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసే మంత్రి పదవి కోసం కాంగ్రెస్‌లో భారీగా పోటీ నెలకొంది. కొద్ది రోజుల్లోనే ఈ ప్రాంతానికి మంత్రి పదవికి ఎవరికైనా దక్కుతుందా? లేదంటే వాయిదాల పర్వమే ఉంటుందా? అన్నది కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది.

# విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- నాసిరకం సరుకులు వస్తే సమాచారం ఇవ్వండి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



కస్తూర్బాలో స్టాక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 24: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. మంగళవారం ఆయన ఆర్మూర్ ఆర్డీవోతో కలిసి పెర్కిట్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలోని డార్మెటరి, స్టోరూం, కిచెన్, ప్లే గ్రౌండ్ తోపాటు స్టోరూంలో నిల్వ ఉన్న సన్న బియ్యం, సరుకుల నాణ్యత, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూలో పొందుపర్చిన వాటికి అనుగుణంగానే ఉన్నాయో లేవో తనిఖీ చేశారు. పర్యవేక్షణ అధికారి ఎక్కడ ఉన్నారని సిబ్బందిని ప్రశ్నించగా.. సమ్మెలో ఉన్నారని డ్యూటీ టీచర్ తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. నాసిరకం బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలను సరఫరా చేస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, అధికారులు ఉన్నారు.

# గాంధారిలో విషాదం



సురేఖ (ఫైల్)

## హైదరాబాద్‌లో యువతి ఆత్మహత్య
## ఆవులకుంట తండాలో విషాదఛాయలు

గాంధారి, డిసెంబర్ 24: పోటీ పరీక్షకు సన్నద్ధమవుతున్న యువతి ఆత్మహత్య చేసుకోవడంతో కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో విషాదం నెలకొంది. మండలంలోని ఆవులకుంట తండాకు చెందిన గుగ్లోత్ బావుసింగ్, లాడుబాయి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె సురేఖ (25) చిన్నప్పటి నుంచే చదువులో ముందుండేది. కామారెడ్డిలో డిగ్రీ, ఓయూలో పీజీ పూర్తిచేసిన ఆమె.. జీవితంలో ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నది. ఈ క్రమంలో గత సంవత్సర కాలంగా హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నది. ఏం జరిగిందో ఏమో కానీ, సోమవారం రాత్రి హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు గుండెలు బాదుకుంటూ హైదరాబాద్‌కు వెళ్లారు. ఉన్నతోద్యోగం సాధించి తండా పేరు నిలబెడుతుందనుకున్న యువతి ఇలా అకస్మాత్తుగా మృతి చెందడంతో స్థానికంగా విషాద ఛాయలు నెలకొన్నాయి.



హైదరాబాద్‌లో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

**పరామర్శించిన జాజాల..**

సురేఖ కుటుంబ సభ్యులను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసోజు శ్రావణ్, గెల్లు శ్రీనివాస్ పరామర్శించారు. ఆవులకుంట తండాకు చెందిన సురేఖ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలియగానే జాజాల తదితరులు గాంధీ దవాఖానకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అక్కడి పోలీసులతో మాట్లాడి ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.




ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న టీయూసీఐ నాయకులు, బీడీకార్మికులు

# జీవనభృతి పెంచి ఇవ్వాలి

- బీడీ కార్మికుల డిమాండ్
- బాల్కొండ ఎంపీడీవో కార్యాలయం ఎదుట టీయూసీఐ ఆధ్వర్యంలో ధర్నా

బాల్కొండ, డిసెంబర్ 24: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం జీవనభృతి రూ.4016లకు పెంచి ఇవ్వాలని బీడీ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బాల్కొండ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 7 లక్షల మంది, జిల్లాలో 3 లక్షల మంది కార్మికులు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురావడంతో బీడీ పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. నెలలో కేవలం ఐదు నుంచి ఏడు రోజులు మాత్రమే పని లభిస్తున్నదని తెలిపారు. దీంతో బీడీ కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న, నాయకులు నజీర్, శ్రీను, నిఖిల్ పాల్గొన్నారు.

# శిశు గృహంలో పసికందు మృతి

- పోలీసులకు నిర్వాహకుల ఫిర్యాదు
- మూడు నెలల చిన్నారి మృతికి నిర్లక్ష్యమే కారణమా!



స్వతంత్ర (ఫైల్)

వినాయక్‌నగర్, డిసెంబర్ 24: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న శిశు గృహంలో మూడు మాసాల పసికందు మంగళవారం మృతి చెందింది. ఓ మతిస్థిమితం లేని యువతి సెప్టెంబర్ 15వ తేదీన జిల్లా ప్రభుత్వ దవాఖానలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. చిన్నారిని చెత్తకుప్పలో వదిలేసి వెళ్లిపోయింది. గమనించిన దవాఖాన సిబ్బంది అధికారులకు సమాచారం ఇచ్చారు. దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, సిబ్బంది సమక్షంలో పాపకు 'స్వతంత్ర' అని నామకరణం చేశారు. తక్కువ బరువుతో జన్మించడంతో పసికందును శిశు గృహంలో ఉంచారు. మూడు నెలలుగా అక్కడే ఉంటున్న పాప శరీరమంతా ఇన్‌ఫెక్షన్ కావడంతో మంగళవారం మృతి చెందగా.. శిశు గృహం బాధ్యులు మూడో టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించినట్లు పేర్కొన్నారు.

**పాప మృతికి బాధ్యులెవరు?**

ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగుతున్న శిశుగృహంలో చిన్నారి ప్రాణాలు పోయే వరకు ఆమె ఆరోగ్య పరిస్థితిని నిర్వాహకులు ఎందుకు పట్టించుకోలేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పసిపాప ఆలన పాలనతో పాటు ఆరోగ్య పరిస్థితిని పట్టించుకోకపోవడంతో అనారోగ్యానికి గురై పాప మృతి చెందిందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు




కామారెడ్డిలో ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల బైక్ ర్యాలీ

# ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినూత్న నిరసన

- నిజామాబాద్‌లో బోనాల పండుగ, కామారెడ్డిలో బైక్‌ర్యాలీ
- 15వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

కంఠేశ్వర్/ కామారెడ్డి, డిసెంబర్ 24 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 15వ రోజుకు చేరుకున్నది. సమ్మెలో భాగంగా మంగళవారం వినూత్న నిరసన చేపట్టారు. నిజామాబాద్‌లో బోనాల పండుగ నిర్వహించారు. సమ్మె శిబిరం నుంచి పోచమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి సమర్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి మనసు కరిగేలా చూడాలని వేడుకున్నారు. కామారెడ్డిలో బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ నెల 27 నుంచి టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు కూడా సమ్మెలో పాల్గొంటారని వారు తెలిపారు. అనంతరం డీఈవో రాజుకు వినతిపత్రం అందజేశారు.